క్షేత్రస్థాయినుంచి బీజేపీ బలోపేతమే లక్ష్యం
» సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆలోచన
» రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానాలు ఆమోదం
- 5లో

అవినీతిలో.. జెమ్స్ 'బాండ్లు'



సురేష్‌నగర్ పార్కు

- » కాకినాడ కార్పొరేషన్‌లో టీడీఆర్ బాండ్ల జారీ అక్రమాలపై కొత్త సర్కారు ఆరా
- » గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడలో రూ.411కోట్ల బాండ్ల జారీ
- » ప్రభుత్వ స్థలమైన సురేష్‌నగర్ పార్కు పేరుతో రూ.161కోట్లు
- » విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం సాకుతో కావాలని ప్రైవేటు స్థలం సేకరణ
- » ప్రతిఫలంగా రూ.251కోట్లు బాండ్ల జారీ చేసిన కార్పొరేషన్ అధికారులు
- » తెరవెనుక చక్రం తిప్పిన కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- » విచారణ జరిగితే ఇరుక్కుపోతామేమోనని అధికారుల్లో గుబులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

నాడు చేతిలో అధికారం ఉందని అడ్డగోలుగా వ్యవహరించారు. ప్రభుత్వ అవసరాల ముసుగులో అస్మదీయులకు భారీగా లబ్ధి చేకూర్చారు. ఆ ముసుగులో తామూ కొంత నొక్కేశారు. వెరసి కాకినాడ కార్పొరేషన్‌కు వందల కోట్లలో ఆదాయానికి గండికొట్టేశారు. టీడీఆర్ బాండ్ల జారీ పేరుతో నిబంధనలకు పాతరేసి కోట్లలో స్వాహా చేసేశారు. అధికారపార్టీ ఎమ్మెల్యే చెప్పింది చేయడమే పనిగా పెట్టుకున్న అధికారులు అడ్డంగా తలూపి బాండ్ల జారీకి సై అనేశారు. అటు నేత, ఇటు కొందరు అధికారులు కలిసి రెండు చేతులా సంపాదించారు. తమ జేబులు నిండడంకోసం కార్పొరేషన్‌నుంచి ఏకంగా రూ.411కోట్ల వరకు బాండ్లు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ పాపాలు పండుతాయేమోనన్న భయం అక్రమార్కులకు పట్టుకుంది. ఎక్కడ కేసుల్లో ఇరుక్కుపోతామోనన్న గుబులు వెన్నాడుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల జరిగిన టీడీఆర్ బాండ్ల జారీ కుంభకోణంపై త్వరలో సీఎం చంద్రబాబు విచారణకు ఆదేశించే అవకాశం ఉండడంతో ఇంకా ఎన్ని భాగోతాలు బయటకు వస్తాయోనని కార్పొరేషన్‌లో అక్రమార్కులకు కునుకులేకుండా చేస్తోంది.

ఇష్టమొచ్చినట్లు ఇచ్చేశారు..

పూర్తిగా ప్రజోపయోగ అవసరాలకు మాత్రమే జారీ చేయాల్సిన టీడీఆర్ బాండ్లను గత వైసీపీ ప్రభుత్వం కాకినాడ కార్పొరేషన్‌లో అడ్డగోలుగా దుర్వినియోగం చేసింది. కార్పొరేషన్ అవసరాల ముసుగులో నచ్చిన ప్రాంతాలను ఎంపిక చేసి ప్రైవేటు వ్యక్తులకు మేలు చేకూర్చి తద్వారా అధికార పార్టీ కీలక నేతలు కోట్లలో సంపాదించారు. ఈ అవినీతికి కార్పొరేషన్ అధికారులు అడ్డంగా సహకరించారు. దీంతో రూ.411కోట్ల వరకు కాకినాడ కార్పొరేషన్ ఆదాయానికి గండిపడేలా టీడీఆర్ బాండ్ల జారీ వ్యవహారం చోటుచేసుకుంది. ఇప్పుడు కొత్తప్రభుత్వం కొలువుదీరడంతో గత పాలనలో జరిగిన టీడీఆర్ బాండ్ల జారీ వెనుక కుంభకోణాన్ని బయట తీసేందుకు అడుగులు పడుతుండడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ స్కాం బయటకు వస్తే తమ పాత్ర ఎక్కడ బయటపడుతుందోనని బాధ్యులైన అధికారులు వణుకుతున్నారు. వాస్తవానికి గత వైసీపీ పాలనలో కాకినాడ సిటీ నియోజకవర్గ ఎమ్మెల్యే ద్వారంపూడి ఏం చెప్తే అదే కార్పొరేషన్ అధికారులకు వేదంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా ఏం చెప్పినా తలూపేశారు. సదరు నేత చెప్పినట్టల్లా ఆడి టీడీఆర్ బాండ్లు జారీ చేసేశారు. ఇలా రూ.411కోట్లకు పైగా విలువైన బాండ్లను గత వైసీపీ ప్రభుత్వంలో రెండేళ్ల వ్యవధిలో జారీ చేయడం తెరవెనుక జరిగిన భాగోతాన్ని చాటుతోంది. దీనిపై కొత్త ప్రభుత్వం కార్పొరేషన్లవారీగా ఇప్పటికే నివేదికలు రప్పించుకుంది. త్వరలో దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించబోతోంది. సురేష్‌నగర్ పార్కు వ్యవహారంలో రూ.160కోట్లవరకు అడ్డగోలుగా టీడీఆర్ బాండ్లు జారీచేసేశారు. దీనివెనుక అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి పాత్ర స్పష్టంగా ఉంది. వాస్తవానికి సురేష్‌నగర్ పార్కు పూర్తిగా ప్రభుత్వ స్థలం. దీనిలో పార్కు అభివృద్ధికి కార్పొరేషన్ నిధులు కూడా వెచ్చించింది. కానీ పార్కు స్థలం తనది అంటూ ఓ వ్యక్తి దొంగ డాక్యుమెంట్లు సృష్టించాడు. తన స్థలంలో పార్కు ఎలా నిర్మిస్తారంటూ అధికారులను బెదిరించాడు. ఇంతలో ద్వారంపూడి జోక్యం చేసుకున్నారు. తతంగం నడిపి భారీగా డబ్బులు కొట్టేశారు. అందులోభాగంగా పార్కు స్థలం తనది అని నకిలీ పత్రాలు సృష్టించిన వ్యక్తికి అండగా నిలబడ్డారు. ఈ స్థలాన్నితిరిగి కార్పొరేషన్ పార్కుకోసం తీసుకోవడానికి సమ్మతించేలా చేసి ఆ స్థలానికి ధర కట్టించారు. ఆ మొత్తాన్ని నగదుకు బదులు టీడీఆర్ బాండ్ల రూపంలో జారీ చేశారు.

అప్పనంగా రూ.251కోట్లు..

కాకినాడ నగరానికి సమీపంలో దుమ్ములపేటలో ట్రాన్స్‌కో అధికారులు పరిశ్రమల అవసరాల కోసం విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాలని నిర్ణయించారు. దీనికి అవ సరమయ్యే స్థలం కూడా చాలా తక్కువ. ఈస్థలాన్ని ట్రాన్స్‌కో సమకూర్చుకోవాలి. లేదంటే ఇతర శాఖల వద్ద ఉంటే కలెక్టర్‌కు లేఖ రాసి తీసుకోవాలి. కానీ ఇక్కడ ఓ ప్రైవేటు వ్యక్తికి కోట్లలో లబ్ధి చేకూర్చడంకోసం అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చక్రం తిప్పారు. ప్రతిపాదిత విద్యుత్‌సబ్‌స్టేషన్ నిర్మించాలనుకునే ప్రాంతంలో కాకినాడ యాంకరేజ్ పోర్టుకు చెందిన భూములు వందల ఎకరాల్లో ఉన్నాయి. ఇందులో కొంత పోర్టునుంచి తీసుకోవచ్చు. కానీ సదరు నేత ప్రత్యేక ఆసక్తితో కథ నడిపాడు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలానికి బదులు ప్రైవేటు భూమి సేకరించాలని సదరు నేత కార్పొరేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. సబ్‌స్టేషన్‌కు అవసరమయ్యేస్థలాన్ని సమకూర్చుకోవాల్సిన బాధ్యత ట్రాన్స్‌కోది అయినా అప్పటి కార్పొరేషన్ కమిషనర్ అత్యుత్సాహం ప్రదర్శించారు. అందులోభాగంగా దుమ్ములపేటలో సర్వే నెంబరు 1986 బై 3డీ2, టీఎస్ నెంబర్ 1989బై 1ఏ,4ఏలో 4.67ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించారు. గజం రూ.28వేల మార్కెట్ ధర చొప్పున 1:4నిష్పత్తిలో రూ.251కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను సదరు ప్రైవేటు వ్యక్తికి జారీ చేసేశారు. ఒకరకంగా ఇది భారీ కుంభకోణం. ప్రభుత్వ భూములు ఉన్నా కాదని, ఓ ప్రైవేటు వ్యక్తి భూమి తీసుకుని సదరు వ్యక్తి కంపెనీ పేరున రూ.215కోట్లు బాండ్లు జారీ చేయడం వెనుక ద్వారంపూడి చక్రం తిప్పగా అధికారులు గుడ్డిగా సహకరించారు. పైగా సదరు ప్రైవేటు వ్యక్తి తనది అని చెబుతున్న భూములు పోర్టు భూములనే ఆరోపణలున్నాయి. టీడీఆర్ బాండ్ల పేరుతో కాకినాడ కార్పొరేషన్ అధికారులు ద్వారంపూడి చెప్పినట్లు తలూపి భారీ కుంభకోణానికి సహకరించిన వైనంపై అప్పటి టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొండబాబు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. జనసేన, బీజేపీ నేతలు సైతం నిరసనలు నిర్వహించారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఈభాగోతంపై కొత్త ప్రభుత్వం ఆరా తీయడం మొదలుపెట్టింది. ఇప్పటికే పురపాలకశాఖ మంత్రి నారాయణ ఆయా కమిషనర్ల ద్వారా అప్పటి బాండ్ల జారీకి నడిపిన ఫైళ్లను కూడా రప్పించుకున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి దర్యాప్తునకు అడుగులు పడుతుండడంతో అక్రమార్కులు వణుకుతున్నారు.

జిల్లాస్థాయి 'గ్రీవెన్స్'కు 405 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 8:జిల్లాస్థాయి గ్రీవెన్స్‌కు 405 అర్జీలు వచ్చాయని డీఆర్‌వో తిప్పేనాయక్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశమందిరంలో ప్రజా ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రజావినతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి తీసుకున్న చర్యలను అప్‌డేట్ చేయాలని ఆయన ఆదేశించారు. డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, సీపీవో త్రినాథ్, గృహనిర్మాణసంస్థ పీడీ సత్యనారాయణ ప్రజలనుంచి 405అర్జీలు స్వీకరించారు. జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, డీపీవో సౌజన్య, లావణ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పోలీస్ 'గ్రీవెన్స్'కు 64 అర్జీలు

కాకినాడ క్రైం, జూలై 8: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లా నలుమూలలనుంచి ప్రజాసమస్యల పరిష్కారం కోసం విచ్చేసిన 64మందినుంచి అర్జీలను ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ స్వీకరించారు. నేరుగా ప్రజలను సమస్యలు అడిగి సత్వర పరిష్కారం కోసం పోలీసు అధికారులకు ఫోన్ చేసి సకాలంలో పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని వారు పోలీస్‌స్టేషన్‌లో అర్జీలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు పాల్గొన్నారు.

పోటెత్తిన అర్జీదారులు



పిఠాపురంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న కలెక్టరు షాన్‌మోహన్

- » పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక
- » ప్రజల నుంచి అందిన 834 వినతులు
- » పరిష్కారానికి అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు.. కలెక్టరు షాన్‌మోహన్

పిఠాపురం, జూలై 8: పిఠాపురంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. వివిధ సమస్యలపై విన్నవించుకునేందుకు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలనుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. వివిధ వర్గాల నుంచి సాయంత్రం వరకూ 834 వినతులు అందాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను పిఠాపురం పట్టణంలోని రథాలపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో సోమవారం నిర్వహించారు. ఈ వేదికకు హాజరైన కలెక్టరు సగిలి షాన్‌మోహన్ తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. దరఖాస్తుదారులకు సదరం అందించేందుకుగాను హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. అర్జీదారులు టోకెన్ నెంబరు ఇచ్చి వరుస క్రమంలో పంపారు. ఉదయం 10గంటలనుంచి సాయంత్రం వరకూ దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. ప్రజాసంబంధిత, రైతుల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు వినతులు అందజేశారు.

ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం

ప్రజలనుంచి అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకుగాను ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ తెలిపారు. ఈ కమిటీలో సభ్యులుగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి జి.శ్రీనివాసరావు, డీఎల్‌డీవోలు పాటంశెట్టి నారాయణమూర్తి, ప్రసాద్‌రాజు ఉంటారని తెలిపారు. అందిన దరఖాస్తులు, అర్జీలను పరిష్కరించి దరఖాస్తుదారుడు సంతృప్తి చెందితే గ్రీన్ కలర్, సగం భాగంలో ఉంటే ఎల్లో, అసలు పరిష్కారం కాకపోతే రెడ్‌కలర్ కింద నోటీసు బోర్డు ఏర్పాటవుతుందని వివరించారు. ఆర్థికపరమైన అర్జీలను నిధులు మంజూరు కోసం పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కాగానే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పారు. కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పలు అంశాలపై ఫిర్యాదులు

- పిఠాపురం పురపాలక సంఘ పరిధిలో గతంలో జరిగిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు ఉన్నాయని, పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేశారని టీడీపీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్‌కు ఫిర్యాదు చేశారు.
- 18ఏళ్లుగా తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని, తమ భూములను వెబ్‌ల్యాండ్‌లో చూపడం లేదని, రైతు భరోసా రావడం లేదని, బ్యాంకుల నుంచి రుణాలు పొందలేకపోతున్నామని, భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు జాబ్ కార్డు కల్పించలేదని, పరిహారం సొమ్ము ఇంకా పలువురు రైతులకు అందలేదని కేఎస్ఈజెడ్ రైతులు విన్నవించారు.
- పిఠాపురం మండలంలోని రాపర్తి, భోగాపురం, రాయవరం, బి.ప్రత్తిపాడు గ్రామాలకు ఏలేరు సాగునీరు సరఫరాలో ఉన్న ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరారు.
- పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి పట్టణాలు, మండలాల పరిధిలో విచ్చలవిడిగా నాటుసారా అమ్మకాలు, బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని వీటి నిరోధానికి చర్యలు తీసుకోవాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.
- మంచానికే పరిమితమైనా రూ.6వేలు మాత్రమే దివ్యాంగ పింఛన్ ఇస్తున్నారని, దాన్ని రూ.15వేలు చేయాలని రాపర్తి గ్రామానికి చెందిన మావూరి సత్యనారాయణ కోరారు.
- తనతోపాటు పదిమంది టిడ్కో ఇళ్లకోసం సొమ్ములు చెల్లించి తొమ్మిదేళ్లు అయిందని, ఇప్పటివరకూ మాకు అపార్ట్‌మెంట్లు అప్పగించలేదని, బ్యాంకు రుణవాయిదాలు కట్ అవుతున్నాయని ఎండీ అహ్మద్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

90శాతం అంగవైకల్యం ఉన్నా పింఛన్ రాలేదు

-షేక్ ఖాసిమ్‌బి, గొల్లప్రోలు ఈబీసీ కాలనీ



90శాతం అంగవైకల్యంతో బాధపడుతున్నాను. ఇప్పటి వరకూ నాకు వికలాంగ పింఛన్ మంజూరు కాలేదు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది.

పింఛను రావట్లేదు: దాసం శివరామకృష్ణ

-దాసం శివరామకృష్ణ



తనకు రోడ్డుప్రమాదంలో కాలు పూర్తిగా చచ్చుపడిపోయిందని,అయినా సదరంలో తాత్కాలిక సర్టిఫికెట్ మాత్రమే ఇస్తున్నారని, పింఛను రావట్లేదని గొల్లప్రోలుకు చెందిన దాసం శివరామకృష్ణ విన్నవించారు.

కుమార్తె ఆచూకీ కనిపెట్టాలని వినతి

తన కుమార్తె అత్తవారింటి నుంచి అదృశ్యమై రెండేళ్ల ఏడు నెలలు అయిందని, ఇప్పటికీ ఆచూకీ లభించలేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినా, స్పందనలో రెండుసార్లు వినతులు ఇచ్చినా ఫలితం లేదని గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన దొడ్డి వరలక్ష్మి కలెక్టరుకు విన్నవిం చుకుంది.

నేటి నుంచి వంతులవారీ విధానం

- » ఏలేరు సాగునీరు పొలాలకు విడుదల
- » నవంబర్ 5వరకు పిఠాపురం, పెద్దాపురం, కిర్లంపూడి మండలాల వంతులవారీగా సాగునీటి సరఫరా
- » జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 8: ఏలేరు సాగునీటి వ్యవస్థ కింద ప్రస్తుతం సాగులో ఉన్న ఖరీఫ్ పంటలను నీటిఎద్దడి లేకుండా సజావుగా పూర్తి చేసుకునేందుకు మంగళవారం నుంచి నవంబర్ 5వరకు రానున్న 120 రోజులపాటు పిఠాపురం, పెద్దాపురం, కిర్లంపూడి మండలాలకు వంతుల వారీ విధానంలో సాగునీరు విడుదల చేస్తున్నామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి 10రోజులు ఒకవంతు చొప్పున తొలి నాలుగు రోజు లపాటు పిఠాపురం మండలానికి తదుపరి మూడురోజులపాటు పెద్దాపురం మండలానికి ఆపై 3రోజులనాటు కిర్లంపూడి మండలానికి రోజుకు 750 క్యూసెక్కుల చొప్పున ఏలేరు నుంచి విడుదల చేస్తామని తెలియజేశారు. షెడ్యూల్ ప్రకారం నీటి విడుదల తేదీలివి..

పిఠాపురం మండలానికి.. జూలై 9-12, జూలై 19-22, జూలై 29-ఆగస్టు 1, ఆగస్టు 8-11, ఆగస్టు 18-21, ఆగస్టు 28-31, సెప్టెంబర్ 7-10, సెప్టెంబర్ 17-20, సెప్టెంబర్ 27-30, అక్టోబర్ 7-10, అక్టోబర్ 17-20, అక్టోబర్ 27-30 వరకు నీరు విడుదల చేస్తామన్నారు.

పెద్దాపురం మండలానికి.. జూలై 13-15, జూలై 23-25, ఆగస్టు 2-4, ఆగస్టు 12-14, ఆగస్టు 22-24, సెప్టెంబర్ 1-3, సెప్టెంబర్ 11-13, సెప్టెంబర్ 21-23, అక్టోబరు 21-23, అక్టోబరు 31-నవంబర్ 2 తేదీల్లో నీరు విడుదల జరుగుతుందని తెలిపారు.

కిర్లంపూడి మండలానికి.. జూలై 16-18, జూలై 26-28, ఆగస్టు 5-7, ఆగస్టు 15-17, ఆగస్టు 25-27, సెప్టెంబర్ 4-6, సెప్టెంబర్ 14-16, సెప్టెంబర్ 24-26, అక్టోబర్ 4-6, అక్టోబర్ 14-16, అక్టోబర్ 24-26, నవంబర్ 3-5, తేదీల్లో నీరు సరఫరా చేస్తామన్నారు. జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్న దృష్ట్యా అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించేందుకు వంతులవారీ విధానం అమలు చేస్తున్నామన్నారు. ఏలేరు సాగు నీటి వ్యవస్థ కింద పంటలను సాగు చేసిన ఆయా మండలాల రైతులు అందరూ ఈ విధానానికి సహకరించి తమ ఖరీఫ్ పంటలను సజావుగా పూర్తి చేసుకోవాలన్నారు.

పౌర హక్కుల పరిరక్షణకు శిక్షణ తరగతులు దోహదం - 5లో

ఈ విద్యాలయం.. దోమల నిలయం



కరప మండలం వేళంగి హైస్కూల్‌లో గోడలపై ముసిరిన దోమలు

- » వేళంగి జడ్పీ పాఠశాలలో దోమల దండయాత్ర
- » వేదనకు గురవుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- » కెమికల్ స్ప్రేయింగ్ చేయించినా వదలని దోమల పీడ..

కరప, జూలై 8: కరప మండలం వేళంగి మెర్లాప్ జడ్పీ ఉన్నత పాఠశాల దోమలకు నిలయంగా మారింది. తరగతి గదులు, వరండా అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ విపరీతంగా ముసిరిన దోమలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. బ్లాక్ బోర్డులు, గోడలపైన, బెంచీలు, బల్లల కింద, గది మూలల్లో దోమలు నక్కి విపరీతంగా కుడుతున్నాయంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమకాటువల్ల మలేరియా, డెంగీ జ్వరాలు విజృంభించే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. కుప్పలు తెప్పలుగా ఉన్న ఈ దోమల బారినుంచి రక్షించుకోవడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు దోమల చక్రాలు, అగరబత్తులు తెచ్చుకుంటున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. హైస్కూల్‌ను చేర్చి ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలపై కూడా దోమలు దండయాత్ర చేస్తున్నాయి. అవి కుట్టినచోట దద్దుర్లు తేలి పుండ్లు పడుతున్నాయని విద్యార్థులు చెప్తున్నారు. పంటపొలాల మధ్య హైస్కూల్, కళాశాలలు ఉండడం, చెంతనే బాయిల ర్ రైస్‌మిల్లు, అక్కడినుంచి విడుదలవుతున్న వ్యర్థాలు, మురుగు కాలువలవల్ల దోమల ఉధృతి అధికంగా ఉంటోందని స్థానికులు చెప్తున్నారు. ఇబ్బడిముబ్బడిగా ఉన్న దోమలను నివారించాలని కోరుతూ ఇటీవల పంచాయతీలో ఇన్‌చార్జ్ హెచ్ఎం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో వైద్యఆరోగ్య, పంచాయతీ సిబ్బంది సమక్షంలో శనివారం సాయంత్రం తరగతి గదులు, గోడలపై దోమల నివారణ మందు పిచికారీ చేయించినట్టు సర్పంచ్ సవిలే నీలిమారాజేష్ తెలిపారు. అయినా ఎటువంటి ఫలితం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. తమ పిల్లల ఆరోగ్యంపట్ల తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. దోమలను పూర్తిగా నివారించే వరకు తమ బిడ్డలను పాఠశాలకు పంపేదిలేదని పలువురు చెప్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన నివారణా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

దోమల అగరబత్తీలు ఇచ్చి పంపిస్తున్నాం

-పెంకే శ్రీనివాస్, విద్యార్థిని తండ్రి, వేళంగి



మా పాప స్కూల్‌లో ఐదో తరగతి చదువుతోంది. దోమల బెడద ఎక్కువగా ఉంటుందని పాఠశాలకు వెళ్లేందుకు జంకుతోంది. దీంతో దోమల అగరబత్తీలు ఇచ్చి స్కూల్‌కు పంపుతున్నాం. దోమలవల్ల విద్యార్థులు చాలా బాధలు పడుతున్నారు.

కెమికల్ స్ప్రే చేయించినా ఫలితం లేదు

-కె.పద్మావతి, ఇన్‌చార్జ్ హెచ్ఎం



పాఠశాలలో అసాధారణంగా ఉన్న దోమలను నిరోధించేందుకు సర్పంచ్ దోమల మందు స్ప్రే చేయించారు. ప్రభుత్వం సప్లై చేసిన స్ప్రేలను వాడుతున్నాం. అయినా దోమలు చావడంలేదు. దోమల బాధ భరించలేక మస్కిటో కాయిల్స్ వాడుతున్నాం. మూడు, నాలుగు, ఐదు తరగతి గదుల్లో దోమలు విపరీతంగా ఉండడంతో విద్యార్థులను వేరే గదుల్లోకి మార్చాం.

దోమలతో సతమతమవుతున్నాం

-విశాల్, విద్యార్థి, వేళంగి జడ్పీ పాఠశాల



పాఠశాలలో దోమలతో తీవ్రంగా సతమతమవుతున్నాం. బెంచీలు, బల్లల కింద నక్కి తెగ కుడుతున్నాయి. వాటి బాధ తాళలేక అవి కుట్టినచోట గోక్కుంటుంటే పుండ్లు పడుతున్నాయి.





తరగతి గదిలో దోమలను చూపుతున్న విద్యార్థి.. (ఇన్‌సెట్‌లో) విద్యార్థి కాలిపై దోమలు కుట్టి తేలిన దద్దుర్లు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఇతర నేతలు



జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యే నల్లమిల్లి



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

- రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ పటిష్టతకు ప్రణాళిక
- సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆలోచన
- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదం

క్షేత్రస్థాయి నుంచి బీజేపీ బలోపేతమే లక్ష్యంగా

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8 : బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం సోమవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగింది. రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి బీజేపీ పార్టీని బలోపేతం చేసే విషయంపై కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి ఘన విజయం సాధించిన తర్వాత రాష్ట్రస్థాయిలో నిర్వహించిన తొలి సమావేశం కావడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు ఎల్ మురుగన్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ తదితరులు మాట్లాడారు. కేంద్ర సమాచారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా దేశంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో మాదిరిగానే ఆంధ్రరాష్ట్రంలోనూ రాబోయే రోజుల్లో అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో జగన్ రాక్షస, నియంతృత్వ, అవినీతి, అరాచకపాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్య మయ్యాయన్నారు. ప్రతీ శాఖను తాకట్టుపెట్టి పెద్దమొత్తంలో అప్పులు చేశారని ఈ ఆర్థిక విధ్వంసం పూడ్చాలంటే దశాబ్దాలు పట్టేటట్టు ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి విజయంతో వచ్చిన బాధ్యతను బీజేపీ కేడర్ అంతా గుర్తుంచుకోవాలని... ప్రజాసంక్షేమ పాలన, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే పాలన, అవినీతిరహిత పాలన అందిస్తేనే ప్రజలు మనల్ని ఆశీర్వదిస్తారని గమనించాలని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఏపీలో గెలుపొందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలను పేరు పేరునా అభినందించారు. ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, విష్ణుకుమార్‌రాజు, ఆదినారాయణరెడ్డి, సుజనాచౌదరి, పీవీ పార్థసారథి, ఎస్.ఈశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, నాయకులు మధుకర్, జీవీఎల్ నరసింహారావు, సోము వీర్రాజు, పీవీఎన్ మాధవ్, శివప్రకాష్, విష్ణువర్ధన్‌రెడ్డి, కాశీ విశ్వనాథరాజు, లంక దినకర్, పాతూరి నాగభూషణం, వేటుకూరి సూర్యనారాయణరాజు, రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు, రొంగల గోపి, అడబాల రామకృష్ణారావు, ఎనుముల రంగబాబు, కురగంటి సతీష్ తదితరులతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి మురుగన్‌ను సత్కరించిన పురందేశ్వరి

రాజమహేంద్రవరంలో
బీజేపీ శ్రేణుల సందడి

రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన బీజేపీ విస్తృతస్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన నాయకులు, కేడర్‌తో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం కావడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కమలం శ్రేణులు తరలివచ్చాయి. బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, రాష్ట్రమంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు పలువురు ఈ సమావేశానికి హాజరుకావడం, వారితోపాటు వారి అనుచరగణం కూడా కార్లు, ఇతర వాహనాల్లో తరలి రావడంతో రాజమహేంద్రవరంలోని పలు ప్రధాన రోడ్లపై హడావుడి కనిపించింది. సెంట్రల్ జైలు రోడ్డులోని ఓ హోటల్‌లో ఈ సమావేశం నిర్వహించారు. దీంతో ఈ రోడ్డు మార్గంలో వాహనాలు బారులు తీరాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సమావేశం జరిగింది. సుమారు 2,500 మంది ఈ సమావేశానికి హాజరయ్యారని నాయకులు వెల్లడించారు. ఈ మార్గంలో దారిపొడవునా బీజేపీ జెండాలు కట్టారు. పలు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. మరో పక్క సమావేశం ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. ఆయా జిల్లాల నుంచి వచ్చిన వారి పేర్ల రిజిస్ట్రేషన్‌కు, ఇతర సమాచారం కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

చక్కటి సమన్వయంతో కూటమి విజయం
కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల చక్కటి సమన్వయంతో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో జరిగిన బీజేపీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరుణ్‌సింగ్, సిద్ధార్థనాథ్ సింగ్ వంటి పెద్దలు ఈ విషయంలో చేసిన కృషి అభినందనీయమన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇలాంటి సమన్వయం పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఎఎస్ చట్టాలను, వాటిని భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినయం పేరుతో సత్వరమే అమలయ్యే చట్టాలను అమల్లోకి తీసుకొచ్చిన ప్రధాని మోదీ ప్రభుత్వానికి మద్దతుగా ప్రజల తరపున బీజేపీ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గ స్వాగతిస్తూ ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

యానాం, జూలై 8: యానాం నియోజకవర్గ పరిధిలోకి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న స్థానిక కురసాంపేటకు చెందిన బల్లా జోజీ (22)ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మురుగనందం తెలిపారు. అతని వద్ద నుంచి సుమారు రూ.20 వేలు విలువ చేసే 40 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇటీవల కాలంలో చెడు వ్యసనాలకు అలవాటు పడిన జోజి తరుచూ ఉప్పాడ వద్ద ఓ గుడి సమీపంలో గంజాయిని తెచ్చి యానాం, పరిసర ప్రాంతాలలో ఎక్కువ రేట్లకు విక్రయిస్తుండగా యానాంలో హైస్కూల్ రోడ్డులో క్రైం సిబ్బంది పట్టుకున్నారన్నారు. గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు జోజిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు.

తుని పట్టణంలో భారీ చోరీ

తాళం పగలగొట్టి రూ.8.5 లక్షల విలువైన బంగారం అపహరణ

తుని రూరల్, జూలై 8: తుని కంకిపాటి వారి గురువు వీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది.తుని పట్టణ సీఐ గీత రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం తుని పట్నం కంకిపాటు వారి గరువుకు చెందిన కల్యాణం సత్యమణికుమార్ ఇల్లుకి తాళం వేసి ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోప్రవేశించి చోరీకి పాల్పడినట్లు వివరించారు.ఈచోరీలో రూ.8.5లక్షల విలువైన బంగారుఆభరణాలు, వెండి దొంగలించబడ్డాయని బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

పౌర హక్కుల పరిరక్షణకు శిక్షణ తరగతులు దోహదం

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల

కాకినాడలో ప్రారంభమైన ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ముప్పాళ్ల సుబ్బారావు

కాకినాడ సిటీ, జూలై 8: రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని, విద్యార్థులు ఆ దిశగా పయనించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. కాకినాడ సూర్యకళా మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులను సోమవారం ముప్పాళ్ల ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం ఆయన రాజ్యాంగంలో హక్కులు, సమాచార హక్కు చట్టం అనే అంశంపై ప్రసంగిస్తూ రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి నూతన విద్యా విధానం-విద్యార్థులపై దాని ప్రభావం అనే అంశంపై మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని అడ్డుకుందామన్నారు. ఈ విధానం వల్ల దేశంలో ఉన్న సంస్కృతి సంప్రదాయాలు తెలియకుండా పోతున్నాయన్నారు. రాష్ట్ర సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఈ పదేళ్లలో కనీసం 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. మూడోసారి అధికారంలోకి ఇతర మార్గాల్లో వచ్చారన్నారు. ప్రొఫెసర్ సీహెచ్ రాంబాబు నేటి సమాజ పరిణామ క్రమం అనే అంశంపై విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ఈ రాజకీయ శిక్షణా తరగతులకు అధ్యక్ష వర్గంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, కావ్య నాగభూషణ్, కుళ్లై స్వామి వ్యవహరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తాటిపాక మధు, రైతు సంఘం నాయకుడు కె.బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు నక్కా శ్రీనివాసరావు, వి.కొండలరావు, పి.సత్యనారాయణ, ఎం.స్టాలిన్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్బారావుచౌదరి



అభినందిస్తున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



సుబ్బారావుచౌదరి

మండపేట, జూలై 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.గంగవరం మండలం యండగండి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చుండ్రు వీరవెంకట సత్యసుబ్బారావుచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండపేట రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, కార్యదర్శిగా ఎస్.సత్తిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన చౌదరి 30 ఏళ్లుగా రైస్‌మిల్లు నిర్వహణలో ఉన్నారు. ప్రస్తుతం కపిలేశ్వరపురం మండలం నాగులచెరువు పరిధిలో శ్రీకృష్ణ కిరీటి ఫుడ్ ప్రొడక్ట్స్‌కు మేనేజింగ్ పార్టనర్‌గా వ్యవహరిస్తున్నారు. చౌదరి పెదనాన్న చుండ్రు సూర్య వెంకట సత్యనారాయణమూర్తి గతంలో ఆలమూరు తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 33 ఏళ్లు ఏకగ్రీవంగా పనిచేశారు. నూతన అధ్యక్షుడు చౌదరిని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధర్, ఇప్పటివరకు కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన వేగుళ్ల పట్టాభి అభినందించారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ రైస్ మిల్లర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు నెక్కంటి శ్రీరామ్‌జీ, గుణ్ణం చరణ్, ఈశ్వరరెడ్డి, కొనగళ్ల సత్యనారాయణ, వంక అన్నవరం, ఐ.ఎస్.ఎన్.చంటిబాబు, వైట్ల దుర్గారావు, మల్లిడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతబాబు దారుణాలపై సీఎంకు 'ముప్పాళ్ల' ఫిర్యాదు

రాజమహేంద్రవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు అనంతబాబు దళితుడైన తన డ్రైవరును అత్యంత పాశవికంగా హతమార్చి మృతదేహాన్ని ఇంటికి పార్సిల్ చేసిన కేసులో త్వరగా కఠిన చర్యలు తీసుకొనేలా చూడాలని కోరుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఈ మెయిల్ ద్వారా విన్నవించినట్టు ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు తెలిపారు. కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను పంపించామన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయవరం, జూలై 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరంలోని ఎం.రామారెడ్డి ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచడంతో పౌరసరఫరాలు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామంలో పలు ఇళ్ల వద్ద నుంచి పీడీఎస్ బియ్యం రామారెడ్డి కొనుగోలు చేసి పాత ఇంట్లో 41 బస్తాల్లో 2,411 కిలోల బియ్యాన్ని నిల్వ ఉంచారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.1.09 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిపై 7(1) కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎంఎస్‌వో షేక్ అహ్మద్ తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ తాడి జగన్నాథరెడ్డి, ఏవో జె.భార్గవ, మహేష్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చెరువులో వృద్ధుడి గల్లంతు

గొల్లప్రోలు రూరల్, జూలై 8: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ఆర్ఆర్‌బీ చెరువులో పడి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన తటవర్తి వేమన్నదొర(68) ఆదివారం సాయంత్రం గేదెలు తోలుకుని ఆర్ఆర్‌బీ చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చిన ఒక గేదె కనబడకపోవడంతో మరలా చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో సోమవారం గ్రామస్తులు, కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. ఇతను చెరువులో పడి గల్లంతయినట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

రంపచోడవరం, జూలై 8: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ శుక్రవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన 18 సంవత్సరాల నుంచి 30 లోపు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 93983 38105 నంబరులో సంప్రదించాలన్నారు.

రైలు నుంచి జారిపడి గార్డుకు తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గార్డు దుర్గాప్రసాద్

సామర్లకోట, జూలై 8: యశ్వంత్‌పూర్ నుంచి హౌరా వెళుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడడంతో రైలు గార్డు తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం తెల్లవారుజామున సామర్లకోట అవుటర్ సిగ్నల్ సమీపాన ఈ ప్రమాదం జరిగింది. రైలులో తన గార్డు విభాగానికి గల హ్యాండిల్ ఊడిపోవడంతో అది పట్టుకున్న గార్డు పట్టుతప్పి వేగంగా వెళుతున్న రైలు నుంచి జారిపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న సామర్లకోట రైల్వే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న అతనిని చికిత్స నిమిత్తం అచ్చంపేటలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా తీవ్రంగా గాయపడిన గార్డును విజయవాడకు చెందిన వై.దుర్గాప్రసాద్‌గా అధికారులు గుర్తించారు. పక్కటెముకలకు, ముఖానికి తీవ్రంగా గాయాలు కావడంతో తీవ్ర రక్త స్రావం అయ్యిందని వైద్యులు తెలిపారు. సామర్లకోట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.500 కోట్లు మింగేసిన జగన్ సర్కార్

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్



భూమిపూజ చేస్తున్న సత్యకుమార్‌యాదవ్

అనపర్తి, జూలై 8: రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా అందించిన రూ.500 కోట్ల నిధులను వైసీపీ పాలనలో పేదలకు చేరకుండా మింగేశారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. అనపర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా మార్పు చేసే క్రమంలో రూ.13.85 కోట్ల నిధులతో నిర్మించనున్న అదనపు భవన నిర్మాణానికి ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్, ఎమ్మెల్సీ రామారావుతో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అనారోగ్య ప్రదేశ్‌గా మార్చిందని, కనీసం సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేదన్నారు. మాజీ సీఎం జగన్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్న ఆసుపత్రులకు సుమారు రూ.2 వేల కోట్ల బకాయిలు పెట్టారన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఆస్పత్రిలోను మౌలిక సదుపాయాలు కల్పించి ఆంధ్ర ప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందం, నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, జనసేన నాయకులు, గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కర్రి శేషారత్నం, జుత్తుగ సూర్యకుమారి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పోలీసు అధికారులపై చంద్ర దండు వలంటీర్ ఫిర్యాదు

అనపర్తి, జూలై 8: గత ఏడాది ఫిబ్రవరిలో అనపర్తిలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన ఇదేం ఖర్మ రాష్ట్రానికి బహిరంగ సభలో తమపై పోలీసులు భౌతిక దాడులు చేశారని వారిపై చర్యలు చేపట్టాలని సోమవారం అనపర్తి పోలీసుస్టేషన్‌లో చంద్ర దండు వలంటీర్ ప్రకాష్‌నాయుడు ఫిర్యాదు చేశారు. చంద్రబాబుకు రక్షణగా చంద్ర దండు పనిచేస్తుందని, నాడు అనపర్తి సభకు వస్తున్న చంద్రబాబును పోలీసులు అడ్డుకుని ఎనిమిది కిలోమీటర్లు నడిపించారన్నారు. అనపర్తిలో జరిగే సభను అడ్డుకోవడమే కాకుండా చంద్రబాబు వద్ద మైక్ లాక్కునే ప్రయత్నం చేసిన పోలీసులను తమ దండు అడ్డుకుందని, ఈ క్రమంలో అప్పటి డీఎస్పీ భక్తవత్సలం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అప్పారావు తమను అడ్డుకుని భౌతిక దాడులకు పాల్పడ్డారని, గాయాలపాలైన తమను చంద్రబాబు చొరవతో టీడీపీ నేతలు ఆసుపత్రికి తరలించారని నాయుడు అన్నారు. అప్పుడు ఎంఎల్‌సీ నిర్వహించి స్టేట్‌మెంట్ తీసుకున్న పోలీసులు నేటికీ కేసు నమోదు చేయకపోవడంతో ఈ రోజు మరలా ఫిర్యాదు చేసేందుకు వచ్చానని ప్రకాష్‌నాయుడు అన్నారు. పోలీసు అధికారులు ముగ్గురిపైనే కాకుండా తమపై దాడికి పరోక్షంగా కారకుడైన అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై కూడా చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

అనకాపల్లి ఎంపీ ప్రత్యేక పూజలు



స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అన్నవరం, జూలై 8: సత్యదేవుడి సన్నిధిలో సోమవారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించిన ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందించగా పీఆర్వో వారికి స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో గంటా విష్ణు పాల్గొన్నారు.

రూ.50,116 విరాళం

అంతర్వేది, జూలై 8: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దర్శనం అనంతరం రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన మల్లిడి వెంకటహనుమాన్‌సంతోష్‌కుమార్‌రెడ్డి-దేవశ్రీ దంపతులు నిత్యాన్నదానానికి రూ.50,116 విరాళాన్ని ఆలయ అధికారి కిరణ్‌కు అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.80వేలు

ఆత్రేయపురం, జూలై 8: వాడపల్లిలో అన్నదాన భవన నిర్మాణానికి ద్వారకా తిరుమల మండలం ఆర్.పంగిడిగూడేనికి చెందిన వడ్లపూడి హరిబాబు కుటుంబ సభ్యులు రూ.55,520, యానానికి చెందిన కుడుపూడి లోకేశ్‌సమీర్‌సాయిబాబు కుటుంబ సభ్యులు రూ.25,050 విరాళం సమర్పించారు. సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.1,80,782 లభించినట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

కార్పొరేషన్(కాకినాడ), జూలై 8: కాకినాడ ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు డిపో మేనేజర్‌కి 9959225534 నంబరులో ఫోన్ చేసి తెలపవచ్చన్నారు.

ఉచిత ఇసుక విధానంతో పేదల ఇంట పండుగ

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, జూలై 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఉచిత ఇసుక విధానం ప్రతి పేదవాడి ఇంట పండుగ అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం ప్రతి భవన నిర్మాణ కార్మికుడి ఇంట, సొంతింటి కల నెరవేర్చుకోవాలని చూస్తున్న ప్రతి పేదవాడి ఇంట ఒక పండుగ వాతావరణం కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సహజ వనరులపై హక్కులను ప్రజల పరం చేయడమే లక్ష్యంగా ఈ ఉచిత ఇసుక విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రజలే నేరుగా డిపో వద్దకు లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలు తీసుకెళ్లి ఇసుకను తీసుకోవచ్చన్నారు. ప్రభుత్వానికి ఇసుక మీద ఎటువంటి ఆదాయం లేకుండా కేవలం నిర్వహణ చార్జీలు, సీనరేజ్ చార్జీలకు మాత్రమే ఇసుక అందిస్తుందన్నారు.

'సామాన్య ప్రజానీకానికి ఉచిత ఇసుక వరం'

సర్పవరం జంక్షన్, జూలై 8: సామాన్య ప్రజానీకానికి ఉచిత ఇసుక ఒక వరమని, పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధికి తొలి మెట్టు వేసిందని టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు, కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) అన్నారు. సోమవారం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే దంపతులు, కరణంగారి సెంటర్‌లో కటకంశెట్టి బాబీలు వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అమల్లోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.50 వేల కోట్లకు పైగా ఇసుక కుంభకోణానికి పాల్పడిందని, జగన్ పాలనలో ఇసుక బంగారంగా మార్చేశారన్నారు. ఉచిత ఇసుక విధానం అమలుతో సామాన్యులకు భారీ ఊరట లభించిందని, సీఎం చంద్రబాబు ముందుచూపుతో ఉచిత ఇసుక పాలసీని అమలు చేశారన్నారు.

తాళ్లరేవు: పేదలకు అందుబాటులోకి ఉచిత ఇసుకను తీసుకువచ్చిన ఘనత టీడీపీదేనని రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చినహామీలో భాగంగా ఉచిత ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి మాట నిలబెట్టుకున్న టీడీపీ ప్రభుత్వం తెలియజేశారు.

'పుష్కలంగా సాగునీరందించేందుకు కృషి'

కరప, జూలై 8: శివారు ప్రాంత రైతులకు కూడా పుష్కలంగా సాగునీరందించేలా కృషి చేస్తున్నట్టు జనసేన పార్టీ యువనేత, స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు సందీప్ తెలిపారు. గొర్రిపూడిలోని ఎత్తిపోతల పథకాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభించడంతో నారుమడులకు అవసరమైన సాగునీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే సొంత నిధులతో పంట, మురుగు కాలువల్లో జరుగుతున్న పూడికతీత పనులను సందీప్ పరిశీలించారు. జనసేన నాయకులు గండి యారీష్‌కుమార్, అనుకుల రాంబాబు, కటకం వీరేశ్వరరావు, పుణ్యమంతుల అన్నారం, పుణ్యమంతుల గంగరాజు తదితరులు ఉన్నారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, జూలై 8: స్థానిక కాకినాడ రోడ్‌లో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటకు చెందిన కురుకూరి వీరవెంకట సత్యనారాయణ(జడ్డి) వారి కుమారుడు గణేష్‌బాబు కలిసి ఆర్థికసాయం అందించి పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, జోగారావు, మారిశెట్టి రాధా, దాపర్తి సీతారామయ్య, దేగల సత్తిబాబు, యల్లమిల్లి సీఎం, కురుమళ్ల నాగేశ్వరరావు, కంటే ఉదయ భాస్కర చౌదరి, అరటా పోలీసు, ఎండీ కాజా, నేదూరి గణేష్, కందుల బాబ్జి,బద్ది సురేష్, ఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

'వరుస దొంగతనాలపై చర్యలు తీసుకోవాలి'

రౌతులపూడి, జూలై 8: ఎస్ఎన్‌పట్నం పంచాయితీ పరిధిలో గల ఈనంలో వరుస దొంగతనాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ లాలం అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ అల్లంబాబు, గ్రామస్తులు సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ గత 15రోజులుగా 3 బైక్‌లు, రైతులకు చెందిన 3 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగతనం చేశారన్నారు. గతంలో మేకలు, కోళ్ల కూడా ఎత్తుకెళ్లిట్టు తెలిపారు. ఇప్పటికీ ఎస్ఎన్‌పట్నం, ఈనం గ్రామాల్లో జోరుగా సారా కాస్తున్నారని, ఈ గ్రామాల మీదుగానే రాత్రిళ్ల గంజాయిని తరలిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

విద్యార్థినికి సైకిల్, పుస్తకాల అందజేత

కరప, జూలై 8: సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ చైర్మన్, హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ తెలిపారు. మండలంలోని సిరిగలపల్లిలంకలో సోమవారం ఆయన పర్యటించి ఈ గ్రామం నుంచి వెళ్లి వేళంగి హైస్కూల్‌లో చదువుతున్న పేద విద్యార్థిని కురుపూడి వీరజ్ఞానేశ్వరికి సైకిల్, పుస్తకాలు అందజేశారు. విద్యార్థిని ఉంటున్న ఇంటికి కిటికీలు లేకపోవడం, భవనానికి ప్లాస్టింగ్ లేకపోవడంతో సంస్థ ద్వారా వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. జనసేన నాయకుడు శాకా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తదితరులున్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రత్తిపాడు, జూలై 8: ప్రత్తిపాడు ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఎంకే బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో 3రోజులు పాటు నిర్వహించిన జిల్లా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు పూర్తయ్యాయి. విజేతలకు సోమవారం ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు బహుమతులు అందజేశారు. ఎంకే బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియానికి చెందిన మల్లా భవానీ శంకర్ సత్యసాయి సేవా సమితి కిర్లంపూడి, ప్రత్తిపాడు సభ్యులు కొమ్ముల జయబాబు, నాగేశ్వరరావు స్థానికులు అంబటి బుజ్జి, రావూరి తాతాజీ, మదినే దొరబాబు, రాంబాబు ఉన్నారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

అన్నవరం, జూలై 8: అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో నెల్లిపూడి, కత్తిపూడి మధ్యలో పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి 13మందిని అరెస్టు చేసినట్టు అన్నవరం ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ప్రత్తిపాడు సీఐకి వచ్చిన సమాచారంతో ఏలేశ్వరం ఎస్ఐ సతీష్, సిబ్బందితో దాడిచేయగా మొత్తం 15మంది పేకాటాడుతుండగా ఇద్దరు పరారయ్యారని, వారి నుంచి రూ.1.05 లక్షల నగదు, 13 సెల్‌ఫోన్లు, 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

ఏలేశ్వరం, జూలై 8: ఏలేశ్వరంలో భార్యభర్తల పాత గొడవలు ఇరువర్గాల మధ్య ఘర్షణగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దవీధికి చెందిన దంపతులు చింతపల్లి నూకరాజు, ఆశా మధ్య పాతగొడవల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ ప్రారంభమై నూకరాజు బంధువులైన చింతపల్లి సత్యానందం, సారికి రాజేష్, సారికి కుమారి, గంధం నాగన్న, చింతపల్లి బుల్లమ్మాయిలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రభుత్వాసుపత్రిలో చిక్సి పొందుతున్న వారి వివారాలు సేకరించి నూకరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రేపు కొత్తపల్లి మండల సర్వసభ్యసమావేశం

కొత్తపల్లి, జూలై 8: కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పి.వెంకటనారాయణ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని కోరారు. వివిధ శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

హోంగార్డులకు చెక్కుల పంపిణీ

కాకినాడ క్రైం, జూలై 8: జిల్లా హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తూ డ్యూటీలో ఉండగా మరణించిన వారికి, రిటైర్డు హోంగార్డులకు కంట్రిబ్యూషన్ సొమ్ము చెక్కులను ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అందించారు. హోంగార్డుల జీతాల్లో నుంచి ఒకరోజు వేతనం ద్వారా సేకరించిన కంట్రిబ్యూషన్ సొమ్మును వీరికి అందించామన్నారు. మృతి చెందిన హోంగార్డుల కుటుంబసభ్యులు ఎస్.జయలక్ష్మి, జి.నాగలక్ష్మి, వై.రాజేశ్వరి, బూర ఎలిజబెత్‌రాణిలతోపాటు రిటైరయిన ఎం.రాజేశ్వరి, పి.రామకృష్ణారావులకు చెక్కులు ఇచ్చారు.

శానిటరీ సూపర్‌వైజర్‌గా నాయుడు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 8: కాకినాడ నగరపాలక సంస్థ 13వ సర్కిల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న గుండుబోగుల సత్తప్పనాయుడు శానిటరీ సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందారు. కమిషనర్ వెంకటరావు ఆర్డర్స్ జారీ చేశారు. అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్ అభినందించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కాకినాడ సిటీ, జూలై 8: మహాజన సోషలిస్ట్ పార్టీ ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ మాదిగ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సాంబమూర్తినగర్ ఐదో వీధిలోని దండోరా స్థూపం వద్ద ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. మందకృష్ణ మాదిగ 59వ పుట్టినరోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు చాట్ల ఆశీర్వాదం, సిద్ధాంతపు జాన్సన్, డోకుబుర్ర భద్రం మాస్టారు, తాతపూడి రాఘవులు, సవరపు వీర్రాజు, మిరియాల వీరబాబు, పోలిపల్లి వెంకట్రావు, దూలపల్లి కృష్ణ, నురుకుర్తి రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం అందిస్తాం

» కాకినాడ కమిషనర్ వెంకటరావు » పలుచోట్ల 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'



కార్పొరేషన్: ఫిర్యాదుదారుడి నుంచి వినతిని స్వీకరిస్తున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 8: ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలకు నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటరావు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫోన్ ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్, యూపీఏ సహా వివిధ విభాగాలకు సంబంధించి 23మంది సమస్యలను కమిషనర్‌కు ఫోన్‌లో వివరించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. అనంతరం ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గతవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల్లో 95శాతం పరిష్కరించామని, మిగిలిన సమస్యలు కూడా త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. 15మంది నేరుగా కమిషనర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏవో శిరీష్ పాల్గొన్నారు.

పెద్దాపురం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి 11 అర్జీలు అందినట్టు ఆర్డీవో సీతారామారావు తెలిపారు. ప్రతీఅర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరిస్తామన్నారు. దీనిలో భాగంగా సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలని, పబ్లిక్ టయిలెట్లు ఏర్పాటుచేయాలని కోరుతూ వినతి అందచేశారు.

తొండంగి: మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 4 ఫిర్యాదులు అందినట్టు తహశీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. 2 పాస్‌పుస్తకాల కోసం, సరిహద్దు తగాదాకు సంబంధించి ఒకటి, ల్యాండ్ సీలింగ్ భూముల వివరాల కోసం మరొకటి ఫిర్యాదులు వచ్చాయి.

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో చెరువుల ఆక్రమణలు, పంచాయితీ నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత లు ఈగల సత్తిబాబు, గండేపల్లి శివ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు చేశారు.

రాష్ట్రాన్ని అన్నివిధాలా ఆదుకోండి

ప్రధానితో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ భేటీ



ప్రధానిని కలిసిన ఎంపీ

కాకినాడ సిటీ, జూలై 8: గత ప్రభుత్వ విధ్వంస పాలన, ఆర్థిక అరాచకాలతో ఆంధ్రప్రదేశ్ 20ఏళ్లు వెనక్కి పోయిందని, విభజన రాష్ట్రాన్ని అన్నివిధాలా ఆదుకోవడం తోపాటు పెండింగ్ ప్రాజెక్టుల మంజూరుకు సహకరించాలని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రధాని మోదీని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఇటీవల ఎంపీ ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రధానితో ప్రత్యేకంగా భేటీ అయ్యి రాష్ట్రాభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించారు. కూటమి నాయకత్వంపై ప్రజలు ఎంతో విశ్వాసంతో చరిత్రలో కనీవినీ ఎరుగని విజయాన్ని అందించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏపీ అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరించాలని కోరారు. రాజధాని అమరావతిని దేశంలోనే మోడల్ రాజధానిగా తీర్చిదిద్దడంతోపాటు ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఉప్పాడ తీరప్రాంతం, టెంపుల్ సర్క్యూట్‌ను అభివృద్ధి చేయడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ ఉదయ్ తెలిపారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

సామర్లకోట జూలై 8: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆషాడ మాసం సోమవారం మహాపర్వదినం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమే శ్వరశర్మ, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్‌ల వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామికి తొలి అభిషేక పూజ లు చేశారు. అనంతరం పుష్పార్చన, విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 500 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భీమేశ్వరాలయంలో వారాహి అమ్మవారికి విశేష పూజలు చేశారు.

'హెల్మెట్ వాడకం తప్పనిసరి'

కాకినాడ క్రైం, జూలై 8: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిఒక్క వాహనదారుడు హెల్మెట్ విధిగా పెట్టుకోవాలని కాకినాడ ట్రాఫిక్-1 సీఐ ఎస్.రమేష్ కోరారు. రహదారి భద్రతా నిబంధనలు-రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎస్పీ సతీష్‌కుమార్, డీటీసీ ఎ.మోహన్ ఆదేశాల మేరకు సోమవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, కాకినాడ మండల్ లీగల్ సర్వీస్ కమిటీల ఆధ్వర్యంలో జిలాని సెంటర్‌లో వాహనదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ ఏపీ పద్మావతి, కాకినాడ ఆర్డీవో బి.మురళీకృష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధారణ తప్పనిసరని, హెల్మెట్‌తో ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. వాహనదారులు, చోదకులకు పువ్వులు ఇచ్చి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీస్ అథారిటీ ప్యానెల్ అడ్వొకేట్ డాక్టర్ వసంత పాల్గొన్నారు.

'కార్పొరేషన్ సొమ్ము దుర్వినియోగం'

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 8: నగరపాలక సంస్థకు చెందిన సొమ్మును స్థానిక 43వ డివిజన్ వైసీపీ మాజీ కార్పొరేటర్ దుర్వినియోగం చేస్తున్నాడని ఆ డివిజన్‌కు చెందిన టీడీపీ, జనసేన నాయకులు ఆరోపించారు. సోమవారం 43వ డివిజన్‌లోని ప్రతాప్‌నగర్ పరిధి జానకి రామ్‌నగర్‌లో తోట నరసింహం పార్కును వారు సందర్శించారు. పార్కులో అతడు మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి దాంట్లో ఐస్‌క్రీమ్ పార్లర్ పెట్టి విక్రయిస్తూ వ్యాపారం చేయిస్తున్నారన్నారు. ఒక కంటెయినర్ ఏర్పాటు చేసి అందులో సగ భాగం వాచ్‌మెన్ కుటుంబానికి ఇచ్చి మరొక సగంలో ఏసీ పెట్టి కార్పొరేషన్ విద్యుత్ కనెక్షన్‌తో వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుని అద్దె వసూలు చేస్తున్నారన్నారు. తక్షణం అధికారులు ఆయన వినియోగిస్తున్న కంటైనర్‌కు విద్యుత్ బకాయిలు వసూలు, ఆర్వో ప్లాంట్ పేరుతో నీటి వ్యాపారం చేస్తున్న రుసుమును పెనాల్టీతో సహా వసూలు చేయాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో చోడిశెట్టి శ్రీమన్నారాయణ, నీలకాయల శివ, కోక సత్తిబాబు, వేములపూడి రాజు, నీలకాయల సన్నీ, చెన్నమెట్టి గోవిందరాజు పాల్గొన్నారు.

గంగనాపల్లిలో గ్రామసభ

కాకినాడ రూరల్, జూలై 8: రూరల్ మండలం గంగనాపల్లిలో పంచాయితీ కార్యదర్శి బి.గోవిందరాజులు ఆధ్వర్యంలో సర్పంచ్ గీసాల మహాలక్ష్మి అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో తాగునీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పారిశుధ్య నిర్వహణ, పంచాయితీ పరిధిలో ఇప్పటి వరకూ చేపట్టిన, రానున్న రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులనుపై సమీక్షించారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు శిరంగు శ్రీనివాసరావు, పాండ్రంకి రాజు, తాడాల అబ్బు, సతీష్ ఉన్నారు.

పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి

కలెక్టర్‌ను కోరిన మాజీ ఎమ్మెల్యే వర్మ



కలెక్టర్‌కు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జూలై 8: ఏలేరు, పీబీసీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ చేశారు. పిఠాపురంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌ను వర్మ సోమవారం కలిసి సాగునీటి ఇబ్బందులపై చర్చించారు. ఏలేరు రిజర్వాయర్‌లో డెడ్‌స్టోరేజీ కంటే దిగువకు నీటినిల్వలు పడిపోయాయని, పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు 700 క్యూసెక్కులను ఏలేరు ప్రాజెక్టుకు మళ్లిస్తున్నారని, ఇది వేయి క్యూసెక్కులకు పెరుగుతుందని వర్మ వివరించారు. ఈ నీటిని పిఠాపురం ఆయకట్టు వంతుల వారీ విధానంలో ముందుగా అందించాలని కోరారు. అన్ని నియోజకవర్గాలకు సమానంగా పంపడంతో శివారు ప్రాంతంగా ఉన్న పిఠాపురం నియోజకవర్గానికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఏలేరు, పీబీసీ కాలువల్లో పూడికలు, గుర్రపుడెక్కలను తొలగించాలని కోరారు. ఉప్పాడ ఫిషింగ్‌హార్బర్ వద్ద బోటు ల్యాండింగ్ సక్రమంగా నిర్మాణం చేయకపోవడంతో 15 బోట్లు ప్రమాదానికి గురై మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని, వారికి పరిహారమివ్వాలన్నారు. పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణకు కృషి చేసిన డిప్యూటీ సీఎం పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కిర్లంపూడిలో వర్మ పర్యటన

జగ్గంపేట: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ కిర్లంపూడి మండలం కృష్ణవరం, బురిపూడిలో పర్యటించారు. పురుషోత్తమపట్నంలో ఉన్న పుష్కర ఎత్తిపోతల పథకాన్ని ద్వారా గోదావరి జలాలతో మెట్టప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్నారు. కృష్ణవరంలోని పుష్కర కాలువ నుంచి ఏలేరుకు ఈ పథకాన్ని అనుసంధానం చేయాలన్నారు. కృష్ణవరం వద్ద పుష్కర పథకాన్ని ఏలేరుకు అనుసంధానం చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. మోరా సత్తి రాంబాబు, పాటంశెట్టి లక్ష్మణమూర్తి, రామిశెట్టి రాజు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు



ప్రత్తిపాడు: ఒమ్మంగిలో అధికారుల తనిఖీలు

ప్రత్తిపాడు, జూలై 8: మండలంలోని ఒమ్మంగి గ్రామంలోని ఉమా రామలింగేశ్వర ఎరువులు, పురుగు మందుల దుకాణంలో సోమవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎఫ్‌టీసీ త్రినాథస్వామి, విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్, పెదపూడి ఏవో మణిదీప్, జగ్గంపేట ఏడీఏ వైవీ గంగాధర్ తనిఖీలు నిర్వహించారు. డీడీఏ త్రినాధ స్వామి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉండే విధంగా ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు.

పెద్దాపురం: పట్టణంలో ఎరువుల దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ త్రినాథస్వామి, డీవీవీ సతీష్ కుమార్ బృందం స్థానిక తాళ్లూరి సూర్యనారాయణ అండ్ సన్స్ దుకాణంలో ఎరువులు, స్టాకు రిజిస్టర్లు తనిఖీలు చేశారు. రికార్డులు సక్రమంగా ఉండడంతోపాటు తేడాలు సరిపోయినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏవో కొమ్మోజు సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: మండలంలో పలు గ్రామాల్లో ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ త్రినాథస్వామి, విజిలెన్స్ అధికారి డి.సతీష్ కుమార్, పెదపూడి మండల వ్యవసాయ అధికారి టి.మణిదీప్, మండల వ్యవసాయ అధికారిణి బి.జ్యోతి తదితరులున్నారు.



ఏలేశ్వరంలో తనిఖీ చేస్తున్న అధికారులు

విద్యార్థుల మధ్య ఘర్షణ

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

సర్పవరం జంక్షన్, జూలై 8: ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్లో విద్యార్థుల మధ్య తలెత్తిన స్వల్ప వివాదం దాడికి దారితీయగా, విచక్షణ కోల్పోయిన ఓ విద్యార్థి మరొక విద్యార్థిపై సర్క్యులేటర్‌తో దాడికి పాల్పడగా మెడపై తీవ్ర గాయం కావడంతో కుట్లు పడ్డాయి. దాడికి పాల్పడ్డ 9వ తరగతి విద్యార్థికి హెడ్మాస్టర్ టీసీ ఇచ్చి పంపించిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాకినాడ రూరల్ మండలం ఏపీఎస్పీ జిల్లా పరిషత్తు హైస్కూల్లో పదో తరగతి విద్యార్థి స్నేహితులు, 9వ తరగతి విద్యార్థి స్నేహితులకు మధ్య ఈనెల 5న స్వల్ప వివాదం చోటుచేసుకోగా ఇద్దరి మధ్య బాహాబాహీకి దిగడం, మధ్యాహ్నం భోజన సమయంలో చేతులను నీటితో కడుకునేందుకు హేండ్ వాష్ వద్దకు 10వ విద్యార్థి వెళ్లాడు. అక్కడకు వచ్చిన 9వ తరగతి విద్యార్థి ముగ్గురుతో కలసి వచ్చి దూషిస్తూ ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య జరిగిన సంవాదంతో సహనం కోల్పోయిన 9వ తరగతి విద్యార్థి తన వద్ద ఉన్న క్యాంపస్ బాక్స్‌లో ఉన్న సర్క్యులేటర్‌తో దాడి చేసి పదో తరగతి విద్యార్థి మెడపై పొడవటం, రక్తం స్రావం జరగడంతో అక్కడ నుంచి విద్యార్థులు పరారయ్యారు. విషయం తెలిసిన ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు బాధిత విద్యార్థి అమ్మమ్మకు సమాచారం ఇవ్వడంతో ఏపీఎస్పీ సమీపంలో గల ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి కుట్లు వేయించారు. ఈ ఘటనపై స్పందించిన ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కబురుపంపి, క్షమాపణ లెటర్ రాయించుకుని, పేరెంట్స్ సూచన మేరకు టీసీ ఇచ్చి పంపింపించినట్టు హెచ్‌ఎం కె.గాయత్రి తెలిపారు. దాడికి పాల్పడిన విద్యార్థిపై బాధిత విద్యార్థి అమ్మమ్మ ఏ ఫిర్యాదు చేయలేదని, పోలీసు కంప్లైంట్ ఇవ్వలేదన్నారు.

షెడ్లు తొలగించిన మాజీ ఎమ్మెల్యే



షెడ్లు తొలగించిన తర్వాత దృశ్యం

సర్పవరం జంక్షన్, జూలై 8: కాకినాడ 2వ డివిజన్ వైద్యనగర్‌లో గల సామాజిక స్థలంలో తాటాకులతో ఏర్పాటు చేసిన 2 తాత్కాలిక షెడ్లను ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్వచ్ఛందంగా తొలగించారు. మాజీ ఎమ్మెల్యే ఇంటి ఎదురుగా కార్పొరేషన్‌కు చెందిన సామాజిక స్థలం ఖాళీగా ఉండడంతో పార్టీ కార్యకర్తలు, ప్రజలు కూర్చునేందుకు వీలుగా తాత్కాలికంగా సిమెంట్ స్తంభాలు, ఇనుప ఊచలపై తాటాకు షెడ్లు ఏర్పాటు చేశారు. సామాజిక స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లు తొలగించాలని కోరుతూ స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. షెడ్లను తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు కన్నబాబును మౌఖికంగా కోరగా, స్వచ్ఛందంగా తొలగించుకున్నారని డీసీపీ హరిదాస్ తెలిపారు.

పిఠాపురంలో ఆక్రమణల తొలగింపు

పిఠాపురం, జూలై 8: పట్టణంలో పంటకాలువలపై ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు సోమవారం సాయంత్రం తొలగించారు. పట్టణంలోని కాకినాడ రోడ్డులో గల 18వ వార్డు పరిధిలోని పంటకాలువలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారని, వీటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని, అసాంఘిక కార్యాకలాపాలు జరుగుతున్నాయని రైతులు కె.మాణిక్యాలరావు సహా పలువురు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఫిర్యాదు చేశారు. సాయంత్రంలోగా వాటిని తొలగించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సదరు ఆక్రమణలు, దుకాణాలను తొలగించారు. ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఆక్రమణల తొలగింపులో టీపీవో శ్రీనివాసరావు, ఎస్ఐ మురళీమోహన్ పాల్గొన్నారు.

లిబరేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

ఏలేశ్వరం, జూలై 8: దళితులకు భూమి పట్టాల ఇప్పించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు నేతృత్వంలో సోమవారం స్థానిక బాలాజీ చౌక్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ మండలంలోని భద్రవరం గ్రామంలో బినామీల పేర్లతో భూములు దోచుకుంటున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ర్యాలీ చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ జి.రవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బర్రే నూకరాజు, జి.సత్యవతి, వీరబాబు, జ్యోతి, సత్యనారాయణ, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో నేత్ర వైద్య శిబిరం

గొల్లప్రోలు రూరల్, జూలై 8: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది 800మంది విద్యార్థులకు పరీక్షలు చేసి 30మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తామని తెలిపారు. పాఠశాల హెచ్ఎం సీ.ప్రకాష్, ఉపాధ్యాయులు వీరాస్వామి, సుబ్బలక్ష్మి, మూర్తి, సురేష్, శేషుబాబు, వీరభద్రరావు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

గొల్లప్రోలు రూరల్, జూలై 8: గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారం చేసే మొండి శ్రీను అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. ఆ కుటుంబాన్ని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ పరామర్శించి నిత్యావసర వస్తువులు, ఆర్థికసాయం అందజేశారు. దేవి వినోదిని, మల్లికల చదువుకు ఆర్థిక సహకారాన్ని అందజేస్తామని తెలిపారు.

వాహనాల తనిఖీ

రౌతులపూడి, జూలై 8: వాహనదారులు భద్రతా నిబంధనలు పాటించాలని కత్తిపూడి ఎమ్‌వీఐ బి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎస్.పైడిపాల- మల్లంపేట రహదారిలో వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వాహనాలపై కేసు నమోదు చేసి రూ.40,000 జరినామా విధించారు.

పిచ్చికుక్క దాడి : ఐదుగురికి గాయాలు

జగ్గంపేట, జూలై 8: జగ్గంపేట మెయిన్ రోడ్డులో సోమవారం పిచ్చికుక్క స్వైర్య విహారం చేసింది. నాలుగు రోడ్ల జంక్షన్లో కుక్కకాటుకు ఐదుగురు గాయాలు పాలయ్యారు. వారికి స్థాని కమ్యూనిటీహెల్త్ సెంటర్‌లో చికిత్స అందించారు.

తరలిన బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు, జూలై 8: రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశానికి ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, నియోజకవర్గ నాయకుడు పైలా సుభాష్ చంద్రబోసు, ఊటా వీరబాబు, కూరాకుల రాజా, పెద్దఎత్తున కార్యకర్తలున్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

కొత్తపల్లి, జూలై 8: మండలంలో శుక్రవారం ఉదయం నుంచి విపరీతమైన ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వాతావరణంలో గాలిఆడక తీవ్ర అపసోపాలు పడుతున్న ప్రజలపై దోమలు దాడిచేస్తున్నాయి. దోమల నివారణ మందును పిచికారీ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.